సాక్షి
అనకాపల్లి
బుధవారం | 19 | జూన్ | 2024



అప్పన్నకు నిత్య కల్యాణం
సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. 8లో



ఘనంగా అష్టదళ పద్మారాధన
విశాఖలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. 8లో



మంచు సోయగం
సాక్షి, పాడేరు: లగిశపల్లి రోడ్డులో మంగళవారం ఉదయం పొగమంచు అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి.

న్యూస్‌రీల్

పీఎం కిసాన్ యోజన 17వ విడత నగదు జమ



పీఎం కిసాన్ యోజన ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు

తుమ్మపాల: రైతన్నలకు ప్రధానమంత్రి కిసాన్ యోజన 17వ విడత సాయాన్ని కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ వారణాసిలో ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. జిల్లాలో 1,88,614 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.37.72 కోట్లు జమ అయినట్టు చెప్పారు. ప్రారంభకార్యక్రమాన్ని జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లోని టీవీల ద్వారా రైతులు వీక్షించారని ఆయన తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 61.24 శాతం ఉత్తీర్ణత

తుమ్మపాల: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. డిగ్రీ, ఇతర ఉన్నత విద్య కోర్సుల్లో చేరే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తొలుత ద్వితీయ సంవత్సరం ఫలితాలను ప్రకటించారు. జిల్లాలో 4,430 మంది పరీక్షలు రాయగా 2,713 మంది ఉత్తీర్ణలయ్యారు. 61.24 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి బి.సుజాత తెలిపారు. అదే విధంగా ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 709 మంది పరీక్ష రాయగా వీరిలో 402 మంది పాసయ్యారు. తద్వారా 57 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆమె చెప్పారు.

పీజీ డిప్లొమా దరఖాస్తు గడువు పెంపు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ మనుమంతు పురుషోత్తం తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో ఈ కోర్సు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ www.andhrauniversity.edu.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9599229217 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేషనల్ కెరీర్ సెంటర్‌లోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేంద్రం డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐ స్మార్ట్ సొల్యూషన్స్‌లో టెలికాలర్‌గా మహిళలకు, డి మార్ట్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్‌గా పురుషులకు, పిజా హట్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్‌గా పురుషులకు, రాథోడ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ నియామకానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి నెలకు రూ 10 నుంచి 15 వేలు వరకు వేతనంగా అందిస్తారు. వివరాలకు 0891–2844184, 9666092491 నంబర్లలో సంప్రదించవచ్చు.

కేజీహెచ్ పూర్వ ఏఆర్ఎంవోపై విచారణ



సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భద్రత సిబ్బంది

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ పూర్వ ఏఆర్ఎంవో, ప్రస్తుత విమ్స్ ఆర్ఎంవో డాక్టర్ అరుణాదేవిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మంగళవారం విచారణ జరిగింది. భద్రతా విభాగ సూపర్‌వైజర్ల ద్వారా వసూళ్లకు పాల్పడ్డారని, నర్సింగ్ స్కూల్ విద్యార్థినుల పరీక్ష సమయంలో అతి జోక్యం చేసుకున్నారని.. ప్రభుత్వానికి, డీఎంఈ డాక్టర్ నరసింహారావుకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీలను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆమె మంగళవారం కేజీహెచ్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. భద్రత సిబ్బందితోపాటు సూపర్‌వైజర్లు, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ట్యూటర్లు, ఇతర సిబ్బందిని విచారించారు. డాక్టర్ అరుణాదేవిపై వచ్చిన ఫిర్యాదులపై వాస్తవాలను అడిగి తెలుసుకుని రికార్డ్ చేశారు. కాగా.. భద్రత విభాగం సూపర్‌వైజర్, ఇతర సిబ్బందిపై ఇదే విభాగానికి చెందిన మరో వర్గం ఫిర్యాదు చేసింది. కొంత మంది భద్రత సిబ్బంది కొద్ది సేపు సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమను బలి చేయొద్దంటూ ఆందోళన తెలిపారు. విచారణ పూర్తి చేసిన తర్వాత నివేదికను డీఎంఈకి అందజేస్తానని డాక్టర్ పద్మలీల తెలిపారు.

పీఎం కిసాన్ విడుదలైంది..

రైతు భరోసా ఎప్పుడో..!

- పీఎం కిసాన్‌లో 1,88,614 మంది రైతులకు రూ.37.72 కోట్ల లబ్ధి
- ప్రతి రైతు ఖాతాలో రూ.2 వేల చొప్పున జమ
- వైఎస్సార్ సీపీ హయాంలో పీఎం కిసాన్ యోజనతో పాటు రైతు భరోసా కింద రూ.5,500 అందజేత
- చంద్రబాబు సర్కారు సాయం కోసం రైతన్నల ఎదురుచూపులు



సాక్షి, అనకాపల్లి: ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయం ఎంతో అవసరం. గడచిన ఐదేళ్లూ తొలకరి సీజన్‌కు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా ఒకేసారి అందించాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా మూడు దఫాలుగా రూ.13,500 అందించే వారు. ఇందులో తొలి విడతగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మే నెలలోనే కేంద్రం రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 రైతులకు అందజేసేవి. దీనివల్ల చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్ పెట్టుబడి, కోతలు, రబీ పెట్టుబడికి కొంత వరకూ వెసులుబాటు లభించేది.

ఇది పెట్టుబడి తరుణం

కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ మొత్తాన్ని మంగళవారం రైతుల ఖాతాల్లో జమ చేసింది. తొలి విడతగా రూ.2 వేల చొప్పున అందజేసింది. ఈ విధంగా 17వ విడత నిధులను వారణాసి నుంచి ప్రధాని విడుదల చేశారు. జిల్లాలోని 1,88,614 మంది రైతుల ఖాతాల్లో రూ.37.72 కోట్లు జమ చేసింది. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినా రైతుకు ఆర్థిక సాయంపై ఇప్పటివరకూ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. నారుమళ్లు వేసుకొనేందుకు రైతులు కూడా సిద్ధమవుతున్నారు. అక్కడక్కడ నారుమళ్లు వేశారు కూడా. ఇటువంటి తరుణంలో వారికి సాగు పెట్టుబడులకు డబ్బులు అవసరమవుతాయి. విత్తనాల కొనుగోలు, నారుమడులు దమ్ము చేసుకొనేందుకు వారికి పెట్టుబడి సాయం ఎంతో అవసరం.

ఆ హామీ అమలు ఎప్పుడో!

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమం తప్పకుండా సాయం అందించడంతో రైతులకు కాస్త ఊరటగా ఉండేది. ప్రభుత్వాలు సాయం అందించడంతో వారు బయట వ్యాపారుల వద్ద పెట్టుబడి కోసం ఒక్క రూపాయి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు.

కానీ నేడు కేంద్రం రూ.2 వేలు మాత్రమే జమ చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ అంశం ఆయన ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కూడా ఉంది. ఎన్నికల్లో గెలిచి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువు తీరి రోజులు గడుస్తున్నా.. పెట్టు బడి సాయం గురించి ఇటు సీఎం చంద్రబాబు కానీ, అటు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కానీ ప్రకటించలేదు.

అంగరంగ వైభవంగా

అమ్మ పండగ





మోదకొండమ్మను దర్శించుకుంటున్న మహారాణి మాయాంక్ కుమారి దేవ్ (ఇన్‌సెట్) మోదకొండమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

- మోదమ్మ దర్శనానికి బారులు
- ఘటాలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ఆకట్టుకున్న నేల, బళ్లవేషాలు
- ముగిసిన నెలరోజుల పండగ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, భక్తుల పాలిట కొంగుబంగారం మాడుగుల మోదకొండమ్మ పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. నెల రోజుల పాటు సతకంపట్టు వద్ద అత్యంత ఘనంగా పూజలు అందుకున్న అమ్మవారు ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. దీంతో నెలరోజుల పండగ ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. స్థానిక ఎస్‌ఐ దామోదర నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రించారు. సతకంపట్టు నుంచి అమ్మవారి ప్రతి రూపాలైన ఘటాలను ప్రత్యేకంగా తయారు చేసిన రథంలో గ్రామ వీధుల్లో ఊరేగించి ఆలయానికి చేర్చారు. చిత్ర విచిత్రమైన నేల వేషాలు, మహిళల కోలాటాలు, బళ్లవేషాలు నడుమ అమ్మవారి ఊరేగింపు సంబరం వైభవంగా జరిగింది. దీంతో అమ్మవారి నెల రోజుల పండగ ముగిసింది. ఈ సందర్భంగా ఆలయకమిటీ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి.

భారీగా సేవా, వితరణ కార్యక్రమాలు

పండగ సందర్భంగా పలు స్వచ్ఛంద, ఇతర సంస్థల సభ్యులు భక్తులకు భారీగా సేవా, వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

- విశాఖ డెయిరీ, మోదమాంబ సాయి లక్ష్మీ వర్తక సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.
- పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పెరుమళ్ల వెంకటరావు సహకారంతో పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.
- శ్రీనాథు ఎర్రన్న శెట్టి చారిటబుల్ ట్రస్టు సభ్యుడు రాంబాబు ఆధ్వర్యంలో విప్రో కంపెనీ ఆర్థిక సాయంతో 20 వేల మందికి భక్తులకు ఉచితంగా గ్లూకోజ్ వాటర్ పంపిణీ చేశారు. ఎండ తీవ్రంగా ఉండడంతో భక్తులు చల్లని గ్లూకోజ్ వాటర్ తాగి ఉపశమనం పొందారు.
- గాంధీ పార్కు సమీపంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరాలు

కేజేపురం, కింతలి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఉచితంగా మూడు మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మోదమ్మను దర్శించుకున్న మాడుగుల మహారాణి

పండగ సందర్భంగా మాడుగుల మహారాణి మాయాంక్ కుమారి దేవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ముందుగా అమ్మవారి పాదాలను, అనంతరం గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు ఇతర కమిటీ సభ్యులు మహారాణికి ఘనస్వాగతం పలికారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం

- విశేషంగా పూర్ణాహుతి



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న అధికారులు, భక్తులు

సింహాచలం:

సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున లోక కల్యాణార్థం నృసింహ హోమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై కొలువుదీర్చారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా చేపట్టారు. ఉభయదాతలందరి చేత స్వామి అష్టోత్తర శతనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమం జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం ఆ జలాలను భక్తులపై జల్లారు. దేవస్థానం తరపున ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.

21న సింహగిరిపై వడాయితీ సంప్రోక్షణ

- సుప్రభాత, ఉదయం ఆరాధన సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ నెల 21న వడాయితీ సంప్రోక్షణ నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మృగశిర కార్తె ప్రవేశించిన తర్వాత ఆగమశాస్త్రం ప్రకారం ఏటా స్వామికి వడాయితీ సంప్రోక్షణ నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా ఈ నెల 21న ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు సుప్రభాతం, ఉదయం ఆరాధన సేవలను రద్దు చేశామని, రాజభోగం నివేదన కూడా ఉదయమే నిర్వహిస్తామన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు దర్శనాల బ్రేక్ ఉండదని, ఆ సమయంలో కూడా దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆస్థానం, విశేష ఆరాధన, నివేదన, సాయంత్రం 5 గంటల నుంచి గ్రామ తిరువీధి ఉంటాయని వివరించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వెంటాడుతున్న బోటు ప్రమాదాలు!

- తాజాగా సముద్రంలో మరో బోటు ఆహుతి
- వరుస ఘటనలతో భీతిల్లుతున్న మత్స్యకారులు

8లో



సురక్షితంగా ఓడ్డుకు చేరిన మత్స్యకారులు

కౌన్సెలింగ్ ద్వారా వీఆర్వోల బదిలీలు

- ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చంటి

చోడవరం: త్వరలో జరగనున్న వీఆర్‌వోల బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. వీఆర్‌వోల సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథరామకాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. అనకాపల్లి జంక్షన్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం స్థలంలో భవనం నిర్మించాలని తీర్మానించారు. అమరావతి ఏపీజేఏసీకి అనుబంధంగా తమ అసోసియేషన్ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు నిర్ణయించారు. రాష్ట్ర అధ్యక్షుడు చంటి, సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యదర్శి అనుపమ, జిల్లా కార్యదర్శి అనంతరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు కె.రాజులనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మై గవర్నమెంట్ క్విజ్‌లో కుసర్లపూడి సోషల్ టీచర్ ప్రతిభ



'మేరా మట్టి మేరా దేశ్ క్విజ్ పోటీలో పొందిన ధ్రువీకరణ పత్రం, (ఇన్‌సెట్) రాంబాబు మాస్టారు

రోలుగుంట: 'మై గవర్నమెంట్ క్విజ్'లో కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ అప్పన రాంబాబు ప్రతిభ చూపి 2 లక్షల క్లబ్‌లో చేరి, చేంజర్ మేకర్ హోదా దక్కించుకున్నారు. ఆ పాఠశాల హెచ్ఎం శెట్టి మోహన్‌రావు, సహచర ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ పోటీలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో పాల్గోవచ్చు. కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచరుగా పనిచేస్తున్న అప్పన రాంబాబు గత ఏడాది నవంబర్ నెలలో తన ప్రస్థానం ప్రారంభించారు. స్వచ్ఛభారత్, ఆజాద్ అమృత మహోత్సవం, బేటీ బచావో బేటీ పడావో, వీరగాథ, ఫ్రీడమ్ ఫైటర్, చారిత్రక ప్రదేశాలు, బ్యాంకింగు, పరీక్ష పే చర్చ, దూరదర్శన్ తదితర పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చూపించి సుమారు 100 మెరిట్ ధ్రువీకరణ పత్రాలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్విజ్ వల్ల సామాజిక విషయాలు తెలియడంతో పాటు విషయ పరిజ్ఞానం పెరిగిందని చెప్పారు.

పంట రుణాల లక్ష్యం రూ.460 కోట్లు

- డీసీసీబీ ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం
- 20 వేల మంది రైతులకు బ్యాంకు ద్వారా తోడ్పాటు
- సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం
- రుణాల రీ-షెడ్యూల్‌పై ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 బ్రాంచీలు, వాటి పరిధిలో 98 సొసైటీల ద్వారా కార్యకలాపాలు



మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య : ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు పడితే విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో రైతులకు ముందస్తు పెట్టుబడి సాయం ఎంతో అవసరం. వ్యవసాయ పనులకు అవసరమయ్యే డబ్బుల కోసమని గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వ్యాపారులు, పెట్టుబడిదారులపై ఆధారపడే పరిస్థితులు ఇంకా ఉన్నాయి. ఈ తరుణంలో రైతులకు పెద్దదిక్కుగా అవసరమైన ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముందు వరుసలో నిలుస్తోంది. అర్హత గల ప్రతీ రైతుకు అవసరం మేరకు రుణాలు ఇచ్చేలా బ్యాంకు అధికారులు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. జూన్ నెల కావటంతో బకాయిల వసూళ్లు, రీ-షెడ్యూల్‌తో పాటు అవసరమైన వారికి రుణాలు అందించేలా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ తమ పరిధిలోని బ్రాంచిల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రైతులకు ఖరీఫ్ రుణాలు

2024–25లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రూ.460 కోట్లు పంట రుణాలు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఖరీఫ్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలో 20 వేల మందికి పైగా రైతులకు ఖరీఫ్ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మార్చి మాసాంతం వరకు రూ.319.12 కోట్లు షార్ట్ టర్మ్ రుణాలు(వ్యవసాయ రంగం) ఇవ్వగా, ఈ ఏడాది అంతకు మించి రుణాలు ఇచ్చారు. సాగు రైతులకు తోడ్పాటు అందించే క్రమంలో భూములపైనే కాకుండా బంగారు ఆభరణాలపై కూడా మిగతా బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నారు. ఇలా గతేడాది రూ.781 కోట్లు మేర రుణాలు ఇవ్వగా, 2024–25 సంవత్సరంలో దీన్ని రూ.1000 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.


యాంత్రీకరణకు పెద్దపీట

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ సాగు చేసే రైతులకు మరింత తోడ్పాటు అందించేలా బ్యాంకు అధికారులు నిర్ణయించారు. గ్రామాల్లోని కొంతమంది రైతులు కలసి ఏర్పాటు చేసుకున్న కస్టమ్ హైరింగ్ కేంద్రాలు(సీహెచ్‌సీ)లను ప్రోత్సహిస్తున్నారు. యాంత్రీకరణ పరికరాలు అనగా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, బ్లోయర్స్, రోటావేటర్లు, దమ్ము పరికరాలు వంటివి కొనుగోలుకు రూ.15 లక్షల వరకు యూనిట్‌గా 50 శాతం డీసీసీబీ ద్వారా తక్కువ వడ్డీకే రుణం అందిస్తున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇలా 208 గ్రూపులకు రూ.4.56 కోట్లు మంజూరు చేశారు. బ్యాంకు ద్వారా సేవలు పొందుతున్న సభ్యుల్లో 75,757 మంది రైతులకు కిసాన్ రూపే కార్డులు జారీ చేశారు.

కొత్త బ్రాంచీల ఏర్పాటుపై కసరత్తు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలోని 30 బ్రాంచీలు, వాటి పరిధిలోని 98 వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బ్యాంకు అభివృద్ధిలో భాగంగా కొత్త బ్రాంచీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. విశాఖ జిల్లాలోని పద్మనాభంలో ఇటీవలే బ్రాంచి ప్రారంభించారు. ఇంకా కొత్తగా అనకాపల్లి -9, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 కొత్త బ్రాంచీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బ్రాంచీల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు నుంచి అనుమతులు కోరుతూ సమగ్ర నివేదికలను పంపించారు.

రైతులకు అండగా నిలుస్తాం



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అండగా నిలిచేలా తగిన కార్యాచరణ సిద్ధం చేశాం. అర్హత గల రైతులందరికీ పంట రుణాలు అందిస్తాం. దీనిపై బ్రాంచిల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం. రుణాల రికవరీ లక్ష్యం మేరకు సాగితేనే బ్యాంకు అభివృద్ధికి దోహదపడుతుంది.రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంకు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు తోడ్పాటు అందిస్తూనే, బ్యాంకు అభివృద్ధిలో భాగంగా వ్యాపార విస్తరణపై కూడా దృష్టి పెట్టాం.

– డి.వి.ఎస్.వర్మ, సీఈవో, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


కొర్ర స్వప్న (ఫైల్)

చింతపల్లి రూరల్: మండలంలోని కిటుముల పంచాయతీ పులుగొంది గ్రామంలో మంగళవారం ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై అరుణ్‌కిరణ్ వివరాల మేరకు... ఎర్రబొమ్మల పంచాయతీ గానుగల గ్రామానికి చెందిన కొర్ర స్వప్న(25)కు పులిగొంది గ్రామానికి చెందిన సత్తిబాబుతో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆమె తన ఇంటి వద్ద దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి సుబ్బరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు గురై గిరిజనుడి మృతి


ఆదయ్య మృతదేహం

అనంతగిరి: మండలంలోని ఎన్‌ఆర్‌పురం పంచాయతీ రాయిపాడులో పాము కాటుకు గురై గిరిజనుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన సావు ఆదయ్య(42) తన ఇంట్లో నిద్రిస్తుండగా రెండు రోజుల క్రితం పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇటీవల వర్షాలకు గ్రామ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో 108 వాహనం వచ్చే పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం ద్విచక్ర వాహనంపై బోడ్డవర మీదుగా ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం జిల్లా మహారాజ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని గ్రామానికి తరలించేలా అంబులెన్స్ ఏర్పాటు చేసేందుకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చర్యలు చేపట్టడంతో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

వెంటాడుతున్న బోటు ప్రమాదాలు!


ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమవుతున్న బోట్లు (ఫైల్)

- ఏడు నెలల కిందట హార్బర్‌లో 49 బోట్ల దగ్ధం
- ఏప్రిల్ 4 అర్ధరాత్రి నడి సంద్రంలో మరో పడవ
- రెండు రోజుల కిందట ఇంకో బోటు మునక
- తాజాగా సముద్రంలో మరో బోటు ఆహుతి
- వరుస ఘటనలతో భీతిల్లుతున్న మత్స్యకారులు


మునిగిన బోటును బయటకు తీస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులను బోటు ప్రమాదాలు వెంటాడుతున్నాయి. వరసగా జరుగుతున్న ఈ ప్రమాదాలు వారిని కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత ఏడాది నవంబర్ 14 రాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు బయల్దేరిన మరబోటు భీమునిపట్నం సమీపంలో ప్రమాదానికి గురైంది. దీంతో అందులో ఉన్న కలాసీలు ప్రాణభయంతో సముద్రంలోకి దూకేసి ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ప్రమాదంలో బోటు యజమానికి రూ.10 లక్షల నష్టం వాటిల్లింది.

- సరిగ్గా ఏడు నెలల కిందట నవంబరు 19వ తేదీ అర్ధరాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటనలో 49 బోట్లు ఆహుతయ్యాయి. దీంతో ఆ బోట్ల యజమానులతో పాటు వాటిపై ఆధారపడ్డ 400 మందికి కలాసీలు జీవనోపాధి కోల్పోయారు. వీరు రోడ్డున పడకూడదన్న ఉద్దేశంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలిపోయిన 49 బోట్లకు రూ.7.11 కోట్లు, కలాసీలకు రూ.10 వేల చొప్పున మూడు రోజుల్లోనే పరిహారం అందజేసింది.
- ఈ ఘటన జరిగిన ఐదు నెలలకు ఏప్రిల్ 4 అర్ధరాత్రి విశాఖకు 65 నాటికల్ మైళ్ల దూరంలోని నడి సముద్రంలో బోటులోని వంట గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో 9 మంది మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. కోస్ట్‌గార్డు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వారిని రక్షించారు. గాయపడ్డ వారిని కేజీహెచ్‌లో చేర్చి చికిత్స అందించారు.
- ఇక ఈ నెల 16వ తేదీ ఆదివారం రాత్రి ఫిషింగ్ హార్బర్ 11వ నంబరు జెట్టీలో మరపడవ మునిగిపోయింది. దీంతో ఆ బోటు యజమానులు కోడ లక్ష్మమ్మ, ఎర్రన్నలకు రూ.25 లక్షల నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బోటు యజమానులకు అండగా నిలిచారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. నష్టపరిహారం అందేలా ఈ విషయాన్ని మత్స్య శాఖ జేడీ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని వాసుపల్లి తెలిపారు.
- ఈ ప్రమాదం జరిగిన 24 గంటలు గడవక ముందే సోమవారం రాత్రి విశాఖకు 28 నాటికల్ మైళ్ల దూరంలోని పూడిమడక సమీపంలో మెకనైజ్డ్ బోటు దగ్ధమైంది. ప్రమాదానికి గురైన పడవకు చేరువలో వేట సాగిస్తున్న మరో బోటు సిబ్బంది ఇందులో ఉన్న మత్స్యకారులను రక్షించారు. దీంతో ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. వీరు మంగళవారం ఉదయానికి విశాఖ ఫిషింగ్ హార్బరుకు చేరుకున్నారు. ఈ బోటు కాలిపోవడంతో యజమానికి రూ.30 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. సంఘటనలో నష్టపోయిన బోటు యజమానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం మత్స్యసంఘాల నాయకులు కోరారు. ఇలా విశాఖ హార్బర్, పరిసర సముద్ర జలాల్లో తరచూ పడవ ప్రమాదాలు సంభవిస్తుండడంతో మత్స్యకారుల్లో తీవ్ర అలజడి రేగుతోంది. ఎప్పుడు ఎలాంటి ఘటనలు జరుగుతాయోనని నిత్యం వీరు భీతిల్లుతున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మత్స్య మాడుగులమ్మ పండగ


ఘటాలను, నాటు తుపాకీ, ఖడ్గాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న మత్స్యరాస వంశీయులు, భక్తులు

జి.మాడుగుల: మత్స్య మాడుగులమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. స్థానికంగా మాజీ ఎంపీ దివంగత మత్స్యరాస మత్స్యరాజు స్వగృహం నుంచి డప్పు వాయిద్యాలతో మత్స్యరాస వంశీయులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘటాలను, పూర్వీకులు వినియోగించిన నాటు తుపాకీ, ఖడ్గం శతకంపట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ భక్తుల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచి అనంతరం పురవీధుల గుండా అమ్మవారి ఆలయ సన్నిధికి చేర్చారు. మండలంతోపాటు పలు జిల్లాల నుంచి అమ్మవారి భక్తులు వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, పాడేరు ఏఎంసీ మాజీ చైర్మన్ గాయత్రి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నాయకులు ఎం వరహాలరాజు, రామరాజు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, ఎస్వీ రమణ, వైఎస్సార్‌సీపీ పాడేరు నాయకుడు కిముడు విశ్వ, గిరిజన పూజారి శివందొర, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు కూలి ఇద్దరికి గాయాలు


పెంకుటిల్లు పైకప్పు

అక్కిరెడ్డిపాలెం(విశాఖ): జీవీఎంసీ 68వ వార్డు మిందిలో పాత పెంకుటిల్లు పైకప్పు కూలి ఇద్దరు గాయాలపాలయ్యారు. ఇంట్లో భీమున బాలాజీ, చిన్నమ్మలు, పిల్లలు బి.శ్యామ్, బి.రమేష్, బి.దుర్గ నివాసం ఉంటున్నారు. కొన్ని రోజుల కిందట బాలాజీ అత్త మజ్జి లక్ష్మి చికిత్స నిమిత్తం వారి ఇంటికి వచ్చింది. బుధవారం ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో బాలాజీ కాలుకు స్వల్ప గాయం కాగా.. లక్ష్మి తల, చేతిపై గాయాలయ్యాయి. స్కూల్‌కు వెళ్లడంతో పిల్లలకు ప్రమాదం తప్పింది.

షార్ట్ సర్క్యూట్ వల్లే కేజీహెచ్‌లో అగ్నిప్రమాదం

- సీఎస్సార్ బ్లాక్‌లో వ్యాపించిన దట్టమైన పొగ
- అంకాలజీ యూనిట్‌కు రోగుల తరలింపు
- ఎలాంటి నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వైద్యులు


అగ్ని ప్రమాదం జరిగిన వార్డు


వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలను పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు


అగ్ని ప్రమాదానికి కారణమైన వెంటిలేటర్

మహారాణిపేట: కేజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని విచారణ కమిటీ తేల్చింది. సోమవారం అర్ధరాత్రి కేజీహెచ్ సీఎస్సార్ బ్లాక్ మూడో అంతస్తు ఐఆర్‌సీయూ బ్లాక్‌లో వెంటిలేటర్ బ్యాటరీ పేలిన ఘటన తెలిసిందే. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వెంటిలేటర్ నుంచి పొగ వ్యాపించింది. ఆ సమయంలో వార్డులో 8 మంది రోగులు చికిత్స పొందుతుండగా.. వారికి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వార్డులో 12 పడకలు ఉన్నాయి.

చార్జింగ్ సమయంలో పేలుడు..

వెంటిలేటర్‌కు చార్జింగ్ అవుతున్న సమయంలో పేలుడు సంభవించింది. కోవిడ్ సమయంలో కేంద్రం నుంచి 248 వెంటిలేటర్లు కేజీహెచ్‌కు చేరుకున్నాయి. ఇందులో ఒకటి పేలిపోగా.. ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగ అలుముకుంది. దీంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. ఆ తర్వాత అగ్ని మాపక అధికారులు రంగంలో దిగే సరికి మంటలు అదుపులోకి వచ్చాయి.

ముగ్గురు వైద్యులతో విచారణ

అగ్ని ప్రమాదంపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ముగ్గురితో విచారణ కమిటీ వేశారు. అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వి.రవి, ఏఆర్ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, బయోమెడికల్ ఇంజినీర్ రాజేష్ విచారణ పూర్తి చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పించారు.

రోగుల తరలింపు

పేలుడు సమయంలో వార్డులోని రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగరావడంతోపాటు శబ్దం వినిపించింది. అదృష్టవశాత్తు రోగులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో రాత్రికి 8 మంది రోగులను కింద అంతస్తులోని మెడికల్ అంకాలజీ వార్డుకు తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడే వైద్య సేవలు అందుతున్నాయి.

పుట్టిన బిడ్డను చూసేందుకు వెళుతూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో దుర్గారావు మృతదేహం

కోటవురట్ల : కూతురు పుట్టిన సంతోషం ఎంతో సమయం నిలవకుండానే ఆ తండ్రి అసువులు బాసాడు. ఆస్పత్రిలో ఉన్న కూతురిని చూడడానికి వెళుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. దాంతో రెండు కుటుంబాలలో తీవ్ర దుఃఖం చోటు చేసుకుంది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టి.జగ్గంపేట గ్రామానికి చెందిన అల్లు దుర్గారావు (26)కు ఒకటిన్నర సంవత్సరాల క్రితం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైంది. వీరికి మూడు రోజుల క్రితం ఓ పాప జన్మించింది. నర్సీపట్నంలోని ఆస్పత్రిలో తల్లీ బిడ్డా చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో దుర్గారావు కె.వెంకటాపురంలోని అత్తింటికి వెళ్లి అక్కడి నుంచి పాపను చూసేందుకు బైకుపై నర్సీపట్నం బయలుదేరాడు. దారిలో తిమ్మాపురం గ్రామంలో తన అన్న అల్లు రమేష్‌ను బైకుపై ఎక్కించుకుని నర్సీపట్నం వెళుతుండగా లింగాపురం సమీపంలోని రెండో కిలోమీటరు రాయి వద్ద మలుపులో వెనుక వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న అల్లు దుర్గారావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న అతని సోదరుడు రమేష్‌కు కుడి చెయ్యి విరిగిపోవడంతో పాటు పలు చోట్ల గాయాలయ్యాయి. అతనిని కోటవురట్లలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

తప్పు చేసిన అధికారులపై చర్యలు తప్పవు

- నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు


అధికారులతో మాట్లాడుతున్న అయ్యన్న

గొలుగొండ: ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతా లోపంతో తారురోడ్డు వేశారని, ఇందుకు కారకులైన అధికారులపై చర్యలు తప్పవని నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారురోడ్డు నిర్మాణ పనులు నాసిరకరంగా ఉన్నాయని, రాత్రి సమయంలో రోడ్డు వేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం రాత్రి సమయంలో రోడ్లు ఎలా వేస్తారని ఆక్షేపించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతితో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంపై పూర్తి నివేదికను తనకు అందించాలన్నారు. దీంట్లో తప్పు చేసిన అధికారులు ఎంతటి వారైనా వారిపై వేటు తప్పదన్నారు. ఈ నెల 24న తాను అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరిస్తానని, తప్పు చేసిన అధికారులను విడిచిపెట్టనని హెచ్చరించారు. పూర్తి నివేదిక వచ్చే వరకు ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించ వద్దన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, పాడేరు ఈఈ బాలసుందరబాబు, నర్సీపట్నం డీఈఈ నాగమోహన్, కృష్ణదేవిపేట జేఈ ప్రసాద్‌తో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన రైతు మృతి

చీడికాడ : పాముకాటుకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రామునాయుడు అనే రైతు సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తురువోలు గ్రామానికి చెందిన గుల్లిపల్లి రామునాయుడు (72)అనే రైతు ఈనెల 10వ తేదీన తన పొలంలో గడ్డి కోస్తుండగా చెయ్యి, కాలుపై రెండు చోట్ల పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు అదే రోజు అతనిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం


ఇద్దరు పిల్లలతో వివాహిత సూకరత్నం (ఫైల్)

యలమంచిలి రూరల్ : మండలంలోని పెద గొల్లలపాలెం గ్రామానికి చెందిన వివాహిత ఈగల సూకరత్నం (26), ఆమె ఇద్దరు కొడుకులు ఈ నెల 15వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు ఆమె భర్త రవి యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 15న సూకరత్నం తన పెద్ద కుమారుడు యశ్వంత్(6), తొమ్మిది నెలల చిన్న కుమారుడితో అచ్యుతాపురం ఆస్పత్రికి వెళ్లింది. అప్పట్నుంచి కనిపించకపోవడంతో వారి కోసం భర్త రవి, కుటుంబ సభ్యులు వెతికారు. అయినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పైలా సింహాచలం విలేకరులకు తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొయ్యూరు: ఆడాకుల సమీపంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. తాండవ నది నుంచి ఇసుకను మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై దాడులు నిర్వహించారు. వాటిని పట్టుకుని కొయ్యూరు రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొర్రాజులకు కోటి దండాలు

మూడేళ్లకు ఒకసారి జరిగే కొర్రాజుల జాతర ఘనంగా మంగళవారం ముగిసింది. భారీగా భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. గిరిజన పూజార్లతోపాటు భక్తులు అగ్నిగుండం తొక్కేందుకు పోటీపడ్డారు. పది రోజులుగా జరుగుతున్న ఈ జాతర సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది.

- భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం తొక్కిన భక్తులు
- భారీగా తరలిరావడంతో సందడి


ఆరాధించే కొర్రాజులు ఉత్సవ విగ్రహాలు


అగ్నిగుండం దాటుతున్న భక్తులు

వీఆర్‌పురం : పోతురాజు గద్దె వద్ద నిర్వహించిన కొర్రాజుల జాతరకు భక్తులు పోటెత్తారు. రేఖపల్లి చెరువుకు సమీపంలోని గద్దెవద్ద గత పది రోజుల నుంచి కొండరెడ్డి, నాయకపోడు గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న జాతర మంగళవారం అగ్నిగుండం (కొండాలు) తొక్కడంతో ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి కుల మతాలకు అతీతంగా భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చారు. గద్దెపై ఉంచిన పోతురాజు, పెదసార్లమ్మ, చినసార్లమ్మ (కొర్రాజులు) ఉత్సవ విగ్రహాలను పూజార్లు పాండురాజు, పోతిరెడ్డి, లచ్చిరెడ్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఇక్కడికి సమీపంలోని సంత చెరువుకు తీసుకువెళ్లారు. అక్కడ స్నానం ఆచరించిన అనంతరం ఊరేగింపుగా తిరిగి రేఖపల్లి గద్దె వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సిద్ధం చేసిన నిప్పుల గుండం చుట్టూ మూడుసార్లు దేవతల ప్రతిమలను ప్రదక్షిణలు చేయించారు. పూజార్లు ప్రతిమలతో నిప్పులగుండం తొక్కుకుంటూ గద్దె లోపలికి చేరుకున్నారు. అనంతరం దేవార్లతో పాటు భక్తులు నిప్పుల గుండం తొక్కేందుకు పోటీపడ్డారు. అగ్నిగుండం వద్ద బూడిదను ఇళ్లకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ అగ్నిగుండాన్ని ఒక్కసారి తొక్కితే కుటుంబం అంతటికీ మేలు జరుగుతుందని నమ్మకమన్నారు. అందువల్లనే అగ్నిగుండం తొక్కేందుకు పోటీపడతామని వారు పేర్కొన్నారు. జాతరలో ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో భక్తులు

క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి

తుమ్మపాల: పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. నూతన జిల్లా ప్రధాన కేంద్రమైన పట్టణంలో కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలు, భవనాలు ఉన్నప్పటికీ.. కేవలం మరమ్మతుల పేరుతో నిరుపయోగంగా వదిలేసి లక్షలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ ప్రైవేట్ భవనాల్లో కొనసాగించడం ప్రభుత్వ ధనాన్ని లూటీ చేయడమేనన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గోపూజ

కశింకోట : అనకాపల్లి గవరపాలెంలోని సతకంపట్టు వద్ద కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం గోపూజ, దుర్గా మల్లేశ్వరస్వామి వారి హోమం, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా వేద మంత్రాల నడుమ హోమం చేశారు. అనంతరం ఆవు, దూడలను నీళ్లతో శుభ్రం చేసి పసుపు, కుంకుమ అద్ది సంప్రదాయంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, వ్యవస్థాపకుడు పి.వి.రమణ, కాండ్రేగుల నాయుడు, పెంటకోట సన్యాసినాయుడు, యల్లపు నాయుడు, కర్రి కల్యాణ్ , శరగడం మోహన్ దంపతులు, ఆలయ కమిటీ, గౌరీపరమేశ్వరుల కమిటీ, మరిడిమాంబ కమిటీల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ



మోదకొండమ్మను దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

తుమ్మపాల: మామిడిపాలెం గ్రామంలో శ్రీమోదకొండమ్మ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ఏర్పాటుకు చర్యలు

గొలుగొండ: కృష్ణదేవిపేటలోనిఅల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద అల్లూరి విగ్రహం ఏర్పాటు కు కమిటీ సభ్యులు అంగీకారం తెలిపినట్లు గ్రంథాలయం వ్యవస్థాపకులు శర్మ మాస్టారు, కొయ్యూరు పూర్వ సీఐ సోమశేఖర్‌లు తెలిపారు. గ్రంథాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే నెల 4న ఆరడుగుల అల్లూరి విగ్రహాన్ని గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 293 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,650	4,960
రెండో రకం	3,990	4,200
మూడో రకం	3,550	3,960

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
గ్యాంగ్ ఆఫ్ గోదావరి	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

యూనిఫాం కోసం ఎదురుచూపు

- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని విద్యాకానుక
- నోట్ పుస్తకాలు, కొన్ని పాఠ్య పుస్తకాలు మాత్రం పంపిణీ



కశింకోటలోని బాలికల హైస్కూల్లో స్టాక్ పాయింట్ నుంచి స్కూళ్లకు సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలు

కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా కానుక పూర్తి స్థాయిలో అందలేదు. యూనిఫాం రాకపోవడంతో బ్యాగులు, బూట్లు, సాక్సులు, బెల్టు వంటి వస్తువులతో కూడిన విద్యా కానుక కిట్లు పంపిణీకి ఎదురు చూస్తున్నాయి. విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ మాత్రం అందజేశారు. వాటిలో పాఠ్య పుస్తకాలలో కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు రాలేదు. గత విద్యా సంవత్సరం వరకు పాఠశాలల ప్రారంభం రోజునే విద్యా కానుక అందించేవారు. ఇప్పుడు పాఠశాలలు తెరచి మంగళవారానికి ఆరు రోజులు అవుతున్నా ఇంకా పూర్తిగా విద్యా కానుక అందకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 41, ప్రాథమికోన్నత పాఠశాలలు మూడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 10, తేగాడలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయి. వీటిలో సుమారు 4,750 మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. వీరికి ప్రభుత్వం ఏటా విద్యా కానుక కిట్లను ఉచితంగా అందజేస్తోంది. దీనిలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగ్, బెల్టు, షూ, సాక్సులు, యూనిఫాం అందిస్తున్నారు. గతేడాది వరకు స్కూల్ ప్రారంభం రోజునే విద్యా కానుక కిట్లను అందజేసేవారు. అయితే ఈ ఏడాది మాత్రం ఇంకా కిట్లు పూర్తిగా అందలేదు.

పూర్తిగా రాని పాఠ్య పుస్తకాలు

1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు వచ్చిన మేరకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు స్కూళ్ల ద్వారా విద్యార్థులకు అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వీటిలో పాఠ్య పుస్తకాలు కూడా పూర్తిగా సరఫరా చేయలేదు. 9వ తరగతికి మాత్రమే తప్ప మిగిలిన తరగతులకు పలు సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇంకా చేరలేదు. ప్రధానమైన పదో తరగతికి భౌతిక శాస్త్రం పుస్తకం రాకపోగా, ఏడో తరగతికి కేవలం ఇంగ్లిష్ వర్క్ బుక్ మాత్రమే వచ్చింది. మిగిలిన సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు రాలేదు. ఇతర, ప్రాథమిక తరగతులకు కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇంకా సరఫరా కాలేదు నోట్ పుస్తకాలు మాత్రం పూర్తిగా వచ్చాయి. వీటిని స్కూళ్లలో పిల్లలకు తరగతుల వారీగా సరఫరా చేపట్టారు.

స్టాక్ పాయింట్‌లోనే వస్తువులు

యూనిఫాంతో పాటు బ్యాగ్, బెల్ట్, బూట్లు, సాక్సులు మాత్రం ఇంకా అందించాల్సి ఉంది. వీటిలో యూనిఫాం రాకపోవడంతో అవి వచ్చే వరకు ఇప్పటికే స్థానిక బాలికల హైస్కూల్ వద్ద ఉన్న స్టాక్ పాయింట్‌కు చేరిన మిగిలిన వస్తువులు నిరీక్షించే పరిస్థితి. త్వరలో యూనిఫారం సరఫరా కానుందని, అది వచ్చాక వాటితో కలిపి మిగిలిన వస్తువులతో కిట్లను విద్యార్థులకు అందజేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ప్రొటోకాల్ అనుసరించి వీటిని అందజేయాలని భావిస్తున్నారు.



స్టాక్ పాయింట్‌లోని మూటల్లో స్కూల్ బ్యాగులు, ఇతర వస్తువులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 90 శాతం మేర సరఫరా చేసిన పుస్తకాలను స్కూళ్ల వారీగా విద్యార్థులకు అందించడానికి చర్యలు తీసుకున్నాం. వివిధ తరగతుల్లో కొన్ని సబ్జెక్టులకు సంబంధించి పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం ఇంకా రావాలి. ఇప్పటికే స్కూల్ బ్యాగులు, బూట్లు, బెల్టు, సాక్సులు స్టాక్ పాయింట్‌కు చేరాయి. యూనిఫాం రాగానే వాటితో కలిపి ఇవ్వాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

–కె.ఎస్.ఎన్.మూర్తి, ఎంఈవో–2, కశింకోట

ఘనంగా సీతారాముల కల్యాణం

కశింకోట: కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యేష్ట శుద్ధ ఏకాదశి సందర్భంగా ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రహదారుల వెలవెల



కశింకోటలో వెలవెలబోయిన పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజలు వరుసగా రెండో రోజు మంగళవారం కూడా సూర్య తాపంతో సతమతమయ్యారు. ఉదయం 11 నుంచి ఎండ వేడిమితో ఎక్కువ శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం 4 గంటల వరకు ఉష్ణ తాపం కొనసాగింది. దీంతో ఇక్కడి రోడ్లు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు కొంతమేర బయటకు వచ్చిన పరిస్థితులు కనిపించాయి.

వైభవంగా గరుడోత్సవం



గరుడ వాహనంపై ధ్యాన వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



మహిళల చిటికల భజన



మహిళల కోలాటం

కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం సాయంత్రం గరుడోత్సవం(తిరువీధి సేవ) వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉత్సవాల ముగింపు సందర్భంగా రెండో రోజు అందంగా అలంకరించిన తిరువీధి పల్లకిపై తిరుమల తరహాలో గరుడ వాహనాన్ని నిలిపి దానిపై ముస్తాబు చేసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, భజనలతో పాటు వాయిద్యాల నడుమ కోలాహలంగా గ్రామ వీధుల్లో రాత్రి 11 గంటల వరకు ఊరేగింపు సాగింది. ఈ సమయంలో ప్రజలు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయంలో కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేయాలి



కశింకోట పీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారి తిరుపతిరావు

కశింకోట: పిల్లల్లో వచ్చే నీళ్ల విరోచనాలు వ్యాధి(డయేరియా)ని నిర్మూలించడానికి అంతా కృషి చేయాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం డయేరియా నిర్మూలన కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి డయేరియాతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. తీవ్రత ఉన్న వారిని ఆస్పత్రికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రమైన మంచినీరు, ఆహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు తల్లి పాలు పట్టాలన్నారు. బయట దుకాణాల్లో దొరికే ఆహార పదార్థాలు తినరాదని, ఈ విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

జమీలు ఆశయ సాధనకు కృషి



దివంగత నేత జమీలు విగ్రహం వద్ద నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నాతవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు దివంగత అంకంరెడ్డి జమీలు జయంతి వేడుకలు మంగళవారం నాతవరంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలోని జమీలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ చేసి, పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి జమీలు అందించిన సేవల్ని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలశాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, వార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



సాయిబాబా, కోరాడ మోహన్‌లను సన్మానిస్తున్న సర్వసిద్ధి వినాయక సేవా సంఘం సభ్యులు

మాడుగుల రూరల్: బాధ్యతతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని విశాఖ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి పుట్టా గంగయ్య అన్నారు. మాడుగులకు చెందిన, గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన అనకాపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారి దళమంతరావు సాయిబాబా, విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఫోర్‌మెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన కోరాడ మోహన్‌లను మంగళవారం సాయంత్రం మాడుగుల కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. స్థానిక సర్వసిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ సాయిబాబా, మోహన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిద్ధాంతి భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రముఖ న్యాయవాది బీవీ జగన్నాథరావు(బాబీ), సీనియర్ పాత్రికేయులు దిమిలి అచ్యుతరావుతో పాటు స్థానికులు వేగి రాంబాబు, అలమండ సూర్యారావు, రాజాజీ తదితర్లు పాల్గొన్నారు.

వసతి గృహం ఏర్పాటుకు వినతి



జిల్లా అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తుమ్మపాల: జిల్లా కేంద్రంగా ఎస్సీ మహిళా కళాశాల వసతి గృహం, ఎస్సీ బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు. నూతన జిల్లా కేంద్రంలోని అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునేందుకు దూరప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, అయితే సరైన వసతి గృహం లేక ప్రైవేట్ అద్దె గదుల్లో ఇబ్బంది పడుతున్నారని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ఫణీంద్రకుమార్ పేర్కొన్నారు. అనేకమంది పేద విద్యార్థులు చదువు మధ్యలో ఆపేసి, విద్యకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రభుత్వానికి నివేదిక రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ, నాయకులు జగదీష్, తాతాజీ పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతుల్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న లోకనాథం

చోడవరం రూరల్: ఈ నెల 22, 23 తేదీల్లో చోడవరంలో జరప తలపెట్టిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల విజయవంతానికి అన్ని వర్గాలు సహకరించాలని జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఎం నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు, పోరాటాలు చేస్తోందని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సహకార చక్కెర కర్మాగారాల ఆధునికీకరణ కోసం తమ పార్టీ అండగా నిలిచిన సంగతిని గుర్తు చేశారు. రంగాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. చోడవరంలోని కల్యాణ మండపంలో జరగనున్న పార్టీ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల నిర్వహణ, విజయవంతానికి స్థానిక ప్రజలు, వ్యాపార వర్గాలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు డి.వెంకన్న, ఎస్‌వీ నాయుడు, వీవీ శ్రీనివాసరావు, జి.నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘పర్తియాత్రకు సత్యసాయి భక్తులు తరలిరండి’

పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తియాత్ర



వేచలంలో సత్యసాయి భక్తులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరిగే పర్తియాత్రకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా వేలాదిగా ఉన్న సత్యసాయి భక్తులు తరలి రావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని వేచలంలో మండల స్థాయి సత్య సాయి సేవా సమితి సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుండి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగనుందన్నారు. ఈ యాత్రకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చేలా కృషి చేయాలన్నారు. కుటుంబ నారాయణ సేవ, శ్రీ సత్య సాయి లక్ష గృహ నామ సంకీర్తన, గ్రామ సేవలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో విశాఖపట్నం జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జక్కాన సూర్యనారాయణ, దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడు ఆదిరెడ్డి చినకన్నబాబు, నౌడు అప్పారావు, సీహెచ్‌వీ రవిశంకర్, గంధం సూర్యం తదితర సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు, భజన మండలి కన్వీనర్లు, మహిళా సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంగ్ల అధ్యాపకునికి డాక్టరేట్

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్, ఆంగ్ల ఆధ్యాపకునిగా పని చేస్తున్న బి.శంకర్‌కు ఆంగ్ల భాషలో శ్రవణ, భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి ఆయనను అధ్యాపకులతో కలిసి మంగళవారం అభినందించారు. రాజస్థాన్‌లోని అల్వార్ సమీపంలో ఉన్న సన్‌రైజ్ యూనివర్సిటీ ఆంగ్ల భాషలో ఆచార్య రష్మీ సక్సేనా పర్యవేక్షణలో ఆంగ్ల భాషలో శ్రవణ, భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై నిర్వహించిన పరిశోధనలో డాక్టరేట్ లభించిన వారికి ఈ నెల 14న డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డాక్టర్ బి.శంకర్ తెలిపారు.

పంపిణీకి 1799 క్వింటాళ్ల వరి విత్తనాలు



మండల కేంద్రంలోని ఆర్బీకేలో వరి విత్తనాల స్టాకును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను బుధవారం నుంచి పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు అందించేందుకు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేసే రైతులు మండలంలోనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తాండవ రిజర్వాయర్ ఆయకట్టు ఎక్కువగా ఉండటంతో ఖరీఫ్ సీజన్లో గరిష్ఠంగా వరి సాగు జరుగుతుందన్నారు. ఈ ఏడాది మండలంలో 1799 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముందుగా వారందరికీ అవసరమైన మేరకు విత్తనాలు అందిస్తామన్నారు. ఇంకా విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక ఆర్బీకేల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. బుధవారం ఉదయం నాతవరం ఆర్బీకే వద్ద ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫార్మాసిటీ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

పరవాడ: ఫార్మాసిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన కరవు వీడీఏ పాయింట్లను అమలు చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు విడుదల చేసే వీడీఏ కరవు భత్యం అన్ని పరిశ్రమల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకొకపర్యాయం రూ.10, రూ.20 పెంచి చేతులు దులుపుకుంటున్నారన్నారు. గత 12 ఏళ్లుగా జీవోను సవరించకపోవడం విచారకరమన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. యాజమాన్యాలకు అండగా ప్రభుత్వాలు నిలుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఫార్మాసిటీలో జీవో సవరించి కనీస వేతనాలు పెంచాలన్నారు. వీడీఏ పాయింట్లను అన్ని పరిశ్రమల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు డి.దేముడు, కె.ఎంకునాయుడు, కె.దొరబాబు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో మలేరియా కట్టడి



ఎ.కోడూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, వైద్య సిబ్బంది

కె.కోటపాడు: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. మండలంలోని ఎ.కోడూరులో మంగళవారం మలేరియా మాసోత్సవంలో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్‌ఎం సంతోషికుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ



ప్రత్యేక అలంకరణలో సన్యాసమ్మ అమ్మవారు

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలుత నిర్ణయించిన మేరకు జూన్ 4న జరగాల్సిన పండగను, ఓట్ల లెక్కింపు కారణంగా ఎన్నికల కోడ్ మేరకు ఇప్పుడు నిర్వహించారు. తీన్మార్ వాయిద్యాలు, డప్పులు, మేళతాళాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ ఆవరణలో ఆలయ కమిటీతో పాటు స్థానిక యువత, భక్తులు ప్రసాద వితరణ, మజ్జిగ, మంచినీరు అందించారు. ఆలయ ధర్మకర్త లలితానాయుడితోపాటు డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, కేవీ రమణ, మహేశ్వరినాయుడు, గొర్లె దేముళ్లు, చొక్కాకుల వెంకటరమణ, వరదపురెడ్డి చంద్రరావు, గంగవంశం సంతోష్, కొరుపోలు శ్రీను తదితర గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.